## క్లుప్తంగా

### పౌష్టికాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. శనివారం సేతుభీమవరంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీలో చేరిక



పారంనాయుడును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: లావేరు మండలం లింగాలవలస గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త పట్నాన పారంనాయుడు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా అహ్వానించారు. కార్యక్రమంలో లావేరు, జి.సిగడాం, రణస్థలం మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, డోల వెంకటరమణ, గొర్లె శ్రీనివాసరావు, లావేరు జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, మండల ఉపాధ్యక్షుడు గొర్లె సూర్యప్రకాశరావు, మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వాళ్లె దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన బాలికపై గ్యాంగ్‌రేప్ అమానుషం



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాడేరులో గిరిజన బాలికపై గ్యాంగ్‌రేప్ అమానుషమని, కూటమి పాలనలో బాలికలు మహిళలకు రక్షణ లేదనడానికి ఈ ఘటన ప్రత్యక్ష సాక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి శనివారం పేర్కొన్నారు. ఈ దారుణ ఘటనపై పార్టీలకు అతీతంగా అందరూ వెళ్లి చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో దోషులు, వారి పూర్తి వివరాలు ఇచ్చినా పోలీసులు కాలయాపన చేయడం తగదన్నారు. నిందితులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### 7న చలో విజయవాడ



నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం: ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహిస్తున్న చలో విజయవాడ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఉమాశంకర్, రాష్ట్ర కార్యదర్శి పద్మావతి పిలుపునిచ్చారు. లావేరు మండలం కొత్తకుంకాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి తప్పించాలని, తక్షణమే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయని పక్షంలో ఉపాధ్యాయుల కార్యాచరణ తీవ్రంగా ఉంటుందన్నారు. నిరసన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నీలంనాయుడు, ఉపాధ్యాయులు ఎస్వీ రమణ, గోపాలకృష్ణ, ఎల్లయ్య, చంద్రరావు, లక్ష్మణరావు, వాణీభాయ్, శ్యామలరావు, కళ్యాణి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న పొన్నాడ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎన్విరాన్‌మెంట్ జిల్లా చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి మన ఊరు- మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, హరికాప్రసాద్, గేదెల ఇందిరాప్రసాద్, ఐ.కె.రావు, గేదెల లక్ష్మి, రిటైర్డ్ వంశధార పర్యవేక్షణ ఇంజినీర్ పి.రంగారావు, చలపాక సూర్యారావు, సుగంధం సంజీవరావు, గొలివి ఉమామహేశ్వరరావు, వై.మోహన్, గుడ్ల జగ్గారావు, కోణార్క్ శ్రీనివాస్, పూజారి లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

# వెలగని లైట్లు.. తప్పని పాట్లు

- వాండ్రంగి వంతెనపై భయం భయం
- సాయంత్రం దాటితే ఆకతాయిల బెడద
- సమీపంలో మలుపు ఉండటంతో తరచూ ప్రమాదాలు



రాజాం-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో వాండ్రంగి వంతెనపై వెలగని విద్యుత్ లైట్లు





ఆనందపురం-వాండ్రంగి గ్రామాల మధ్య మలుపులో బోల్తాపడిన లారీ(ఫైల్)

జి.సిగడాం:

రాజాం-శ్రీకాకుళం రహదారిలో వాండ్రంగి రైల్వే వంతెనపై లైట్లు వెలగకపోవడంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంతమంతా సాయంత్రం 6 దాటితే చీకటి మయం కావడంతో మందుబాబు, ఆకతాయిలు వంతెనను అడ్డాగా చేసుకుంటున్నారు. కొన్నిసార్లు రోడ్డుపైకి వచ్చి వాహనచోదకులకు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు.

**ఆరు దాటితే అవస్థలు**

సాయంత్రం ఆరు గంటలు దాటితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వంతెనపై కారుచీకట్లు కమ్ముకోవడంతో ఈ ప్రాంతంలో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. వంతెన ప్రాంతంలో ఇరువైపులా తోటలు, వెంచర్లు ఉన్నాయి. వంతెన కింద ఖాళీ భాగంలో కొందరు మందుబాబులు సైతం చేరి మద్యం మత్తులో ఇతరులకు ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలూ ఉన్నాయి. ఇదే ప్రాంతంలో ఆనందపురం నుంచి వంతెన వరకు పెద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. గత నెల 25న భారీ ఇథైల్ ఆల్కహాల్ లారీ కూడా ఇదే ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. పొందూరు, చిలకపాలెం, రాజాం, శ్రీకాకుళం నుంచి నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెనపై ప్రయాణిస్తుంటాయి. విద్యుత్ దీపాలు ఉంటే కొంతమేర ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని వాహనచోదకులు చెబుతున్నారు.

### తప్పని ఇబ్బందులు



వంతెనపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాజాం-శ్రీకాకుళం నుంచి రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వంతెన వద్ద మందుబాబులు, ఆకతాయిలు వాహనచోదకులను ఇబ్బందిపెడుతున్నారు.

– బుదారి లక్ష్మణరావు, సర్పంచ్, సంతవురిటి

### చర్యలు తీసుకోవాలి



వాండ్రంగి రైల్వే వంతెనపై లైట్లు వెలగకపోవడంతో సాయంత్రమైతే చాలు ఆకతాయిల ఇబ్బంది ఎక్కువవుతోంది. దీంతో బైకులపై వస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి,

– వడిశ మహేశ్వరరావు, సర్పంచ్, దవళపేట

### రాత్రివేళలో ప్రత్యేక నిఘా



ప్రతి రోజు రాత్రి 9 నుంచి ఉదయం 3 గంటల వరకు ఈ ప్రాంతాల్లో నిఘా వేస్తున్నాం. వంతెన లైట్లు వెలగకపోయినా తరచూ తనిఖీలు చేస్తున్నాం. ప్రమాదాల నివారణకు మా వంతు చర్యలు చేపడుతున్నాం.

– వై.మధుసూదనరావు, ఎస్ఐ, జి.సిగడాం

## పార్టీ బలోపేతానికి కృషి



ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న చల్లా శ్రీనివాసరావు, గొండు కృష్ణమూర్తి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన గొండు కృష్ణమూర్తి, చల్లా శ్రీనివాసరావులు శనివారం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.



నాయకులకు కృతజ్ఞతలు తెలిపుతున్న గంట్యాడ రమేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గంట్యాడ రమేష్ పార్టీ పార్లమెంటరీ పరిశీలకుడు కుంభా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

## ఏఐటీయూసీలోకి ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు



ట్రాన్స్‌పోర్టు కార్మికులతో సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మిక హక్కుల పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసి ఎన్నో చరిత్రాత్మకమైన విజయాలను సాధించిన ఏఐటీయూసీలోకి ట్రాన్స్‌పోర్టు కార్మికులు చేరడం ఆనందంగా ఉందని కౌన్సిల్ సభ్యులు టి.తిరుపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయుకులు కళ్యాణి అప్పలరాజులు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దమార్కెట్ వద్ద సీఐటీయూలో ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్మికులను కండువా వేసి ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ కార్మికుల పనిగంటలను 8 నుంచి 10 గంటలకు పెంచడం అన్యాయమన్నారు. భవిష్యత్‌లో ఉద్యమాలు ఉద్ధృతం చేసి హక్కులు సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లక్ష్మీనారాయణ, పకీర్, లక్ష్మణ, అప్పన్న, చలం, శివ, మహేష్, నరేష్, మల్లేషు, రవి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవస్థల నిర్వీర్యం తగదు



సంతకాల సేకరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ సర్కారు వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంబటి కృష్ణారావు అన్నారు. శనివారం శ్రీకాకుళం నియోజకవర్గ స్థాయిలో ఓట్ చోరీ గద్దిచోడ్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం అవమానపరిచిందన్నారు. పౌరుల ఓటు హక్కును దొంగిలించిన ఎన్‌డీఏ కూటమిని నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీఎల్ఎస్ ఈశ్వరి, బొచ్చ వెంకటరమణ, ఆబోతుల వెంకటనాయుడు, ముద్దాడ లక్ష్మణ, సైదుల్లా ఖాన్, సొడవరం చంద్రశేఖర్, అప్పారావు, మైలపల్లి చిన్నారావు, మైలపల్లి లక్ష్మణ పాల్గొన్నారు.

### అన్ని పత్రాలుంటేనే రూ.15వేలు

రణస్థలం: ఆటో, క్యాబ్ డ్రైవర్లు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉంటేనే రూ.15వేలు జమవుతాయని విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని జె.ఆర్.పురం హైస్కూల్లో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ తగ్గింపు స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా తనిఖీ అధికారి శిరీష, తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో మార్కండేయ, వ్యవసాయ ఏడీఏ వి.శ్రీనివాసరావు, కూటమి నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రపంచ బెస్ట్ టీచర్స్ ఇంటర్నేషనల్ అవార్డ్–2025కు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు ఈ.ఎస్.ఎస్.నారాయణ శనివారం తెలిపారు. వివరాలకు 9652347207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

శ్రీకాకుళం: సోంపేటలో పనిచేస్తున్న శశికళ అనే ఉపాధ్యాయురాలి భర్త రమణ అనారోగ్యం బారిన పడటంతో చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు శనివారం శశికళ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు కృషి మేరకు నిధులు మంజూరైనట్లు పీఆర్‌టీయూ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తంగి మురళీమోహన్, పప్పల రాజశేఖర్, బత్తుల రవికుమార్, బైరి అప్పారావు, వి.హరిశ్చంద్రుడు, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కరుణించమ్మా..కనకదుర్గమ్మా..



శ్రీకాకుళం కల్చరల్: బలగలో అమ్మవారి ఊరేగింపు



శ్రీకాకుళం రూరల్: పెద్దపాడులో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



పెద్దపాడు రోడ్డులో అన్నదానం



దుర్గాదేవి విగ్రహాన్ని నాగావళి నదిలో నిమజ్జనం చేస్తున్న భవానీస్వాములు



జి.సిగడాం: దుర్గమ్మ సారెతో ఊరేగింపు చేస్తున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: డే అండ్ నైట్ వద్ద దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలా త్రిపుర కాలభైరవస్వామి పీఠం దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని శనివారం నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. ముందుగా గణేష్ గురూజీ ఆధ్వర్యంలో ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని నది వరకు ఊరేగింపు నిర్వహించారు. భవానీల శరణుఘోష నడుమ అంగరంగ వైభవంగా పవిత్ర నాగావళి నదిలో నిమజ్జనం చేశారు.

– పెద్దపాడు రోడ్డులోని ఈరన్న షెడ్ ప్రాంగణంలో దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం అమ్మవారికి కట్టిన చీరలను, మహాలడ్డు, గాజులు వేలం వేశారు. అనంతరం ఊరేగించి నాగావళి నదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

శ్రీకాకుళం రూరల్: పెదపాడులో దుర్గా స్కూటర్ మోటార్ సైకిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. తప్పెటగుళ్లు, కోలాటం మధ్య ఊరేగింపు జరిగింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో శ్రీకాకుళం టౌన్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

జి.సిగడాం: దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పెంట గ్రామంలో సందర్భంగా దుర్గాదేవికి పలు రకాల పిండి వంటలు చీరలు, గాజులు సమర్పించి అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీరామా యూత్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

### పాతబ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్



నగరంలోని పాతబ్రిడ్జిపై శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దసరా నవరాత్రులు ముగింపు సందర్భంగా దుర్గాదేవి విగ్రహాలను అనుపు ఉత్సవం చేసేందుకు ఒకేసారి పాతబ్రిడ్జిపైకి తీసుకురావడంతో క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

– శ్రీకాకుళం అర్బన్

## వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్



పోతయ్యవలసలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కూటమి పార్టీ నుంచి ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌కు సమాచారం అందిస్తే పార్టీ తరపున న్యాయం జరిగేలా చూస్తామని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం పోతయ్యవలస, లింగాలవలస, వెంకటాపురం, లావేరు పంచాయతీలకు చెందిన కార్యకర్తలతో డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌పై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నుంచి అన్యాయానికి గురైన, ఎటువంటి ఇబ్బందులు పడినా క్యూ ఆర్ కోడ్ సేవలు వినియోగించుకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ కోసం పని చేసే కార్యకర్తలు, నాయకులను టార్గెట్ చేసి మరీ వేధిస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి అరాచకాలను అడ్డుకట్ట వేసేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం సమష్టిగా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, నాయకులు బూరాడ చిన్నారావు, గొర్లె సూర్యప్రకాశ్‌రావు, దేశెట్టి తిరుపతిరావు, కొంపెల్ల వరంధామయ్య, అప్పన్న, వాళ్లె దాలినాయుడు, బొంతు యల్లంనాయుడు, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవాభావం అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం పీఎన్ కాలనీ: సేవ చాలా గొప్పదని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో కొనసాగాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఎన్‌జీవో కార్యాలయంలో సాహుకారి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం 40మంది కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలు మహంతి ఉమామహేశ్వరరావు, సాహుకారి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ సాహుకారి నాగేశ్వరావు, లయన్స్ క్లబ్ నటుకుల మోహనరావు, శ్రీనివాస పట్నాయక్, పి.పద్మ, శ్రీదేవి, ఎన్‌జీఓ నాయకులు హనుమంతు సాయిరాం, రిమ్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి పోలుమహంతి వెంకటసాయిమనోజ్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు టి.తిరుపతిరావు, ఎం.వి.మల్లేశ్వరరావు, జి.వి. నాగభూషణరావు పాల్గొన్నారు.

## వరదనీటితో అవస్థలు



తాన్‌సాహెబ్‌పేట కాలనీలో నిలిచిన వరద నీరు

గార: వంశధార నీరు పోటెత్తడంతో కళింగపట్నం పంచాయతీలో పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామాల్లోకి వచ్చి నీరు 24 గంటలు దాటినా రోడ్లుపైనా, వీధుల్లోనే నిలిచిపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాన్‌సాహెబ్‌పేట కాలనీలో వీధి లోతట్టు ప్రాంతం కావడం, దిగువకు వెళ్లేందుకు ఔట్‌లెట్ మూసుకుపోవడంతో నీరు నిలిచిపోయింది. అధిక వర్షాలు కురిసినా, వరద నీరు వచ్చినా ఏటా ఇదే పరిస్థితి వస్తోందని కాలనీలో రెండు వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంచ్రవీధిలో స్కూల్ ప్రాంతం, మరో వీధిలో నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కంద్రవీధి నుంచి నగరాలపేటకు వెళ్లే దారిలో నీరు ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి నీరు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆలయానికి వితరణ



ధారాపాత్రను అందజేస్తున్న శ్రీకాంత్

శ్రీకాకుళం రూరల్: ఇప్పిలి గ్రామంలో ఉమా పిప్పిలేశ్వరస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన గాయకుడు శ్రీకాంత్ రూ.1.80 లక్షలు విలువైన వెండి ధారాపాత్రను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇప్పిలి సత్యనారాయణ, పురోహితులు పాల్గొన్నారు.

## అలరించిన సంగీత విభావరి



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో 312వ నెలవారీ కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో శనివారం నిర్వహించారు. వి.ఆర్. మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వాహకులు చింతలపూడి వెంకటరావు సంగీత సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గాయకులు చక్కగా ఆలపించారు. కీబోర్డుపై వెంకటరావు, ఎం.రాజు, తబలాపై శ్రీను, పేడ్స్‌పై బుజ్జి వాద్య సహకారం అందించారు. అనంతరం విశ్రాంత ఆర్‌డీఓ పి.ఎం.జె.బాబు, శాక్సాఫోన్ కళాకారులు చింతలపూడి రాజు, వయోలిన్ విద్వాంసులు మడిపల్లి లక్ష్మణరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి, సుసరాపు లక్ష్మీ గణపతి శర్మ, సనపల నారాయణరావు, కళాకారుల సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, బి.రామచంద్రదేవ్, కంచరాన అప్పారావు, ఇంజరాపు రమణారావు, పాట్నూరు వెంకటరావు, పైడి సత్యవతి, జ్యోతి పాల్గొన్నారు.